


# దశమ గ్రహప్రభావం

హైదరాబాద్ నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్ బస్‌స్టాండ్‌లో ఆగింది. తెల్లవారుజాము. సూట్‌కేస్ పట్టుకుని బస్సు దిగాడు గోపాల్. అప్పటివరకు బస్సులో నిద్రపోయాడేమో చాలా బద్ధకంగా వుంది గోపాల్‌కి.

'ముఖం కడుక్కుంటేనో! అనే ఆలోచన వచ్చింది.

తర్వాత 'టీ' తాగాలనిపిస్తుంది.

డబ్బు ఖర్చు పెట్టాల్సి వచ్చినప్పుడు తండ్రి చెప్పిన హితోపదేశం ఖచ్చితంగా పాటిస్తాడు గోపాల్.

ఆ తండ్రి ఏం చెప్పాడు?

'నాన్నా! ఒక రూపాయి ఖర్చు పెట్టాల్సివస్తే వెంటనే ఆ పని చెయ్యకు ఆ ఖర్చునుంచి తప్పించుకునే మార్గం వుందా అని ఆలోచించు. మార్గం దొరికితే వెల్ అండ్ గుడ్. లేనప్పుడు తప్పదు.'

గోపాల్ బస్టాండ్‌లో నుంచి బైటకు వస్తుంటే ఆటోవాళ్లు వెంటబడ్డారు. సూట్‌కేసు లాక్కోబోయారు. అతను ఎవరికీ ఛాన్స్ ఇవ్వలేదు.

ఆటో భాయీలు ఇరవై. పాతిక అడుగుతారని అతనికి తెలుసు. రిక్షానే చౌక రిక్షా లాగేవాడు ముసలివాడైతే ఇంకా చౌకగా వస్తాడు.

ఈ చలిలో కొత్తపేట వెళ్ళాలి. రిక్షావాడు ఎంత అడుగుతాడో? ఆరు, ఏడు డిమాండ్ చేస్తాడేమో? కనీసం ఐదు రూపాయలు ఇవ్వందే ఎవడూ రాడు.

'ఐదు రూపాయలే'

ఈ ఖర్చు నుంచి తప్పించుకునే మార్గం వుందా?

నడిచి వెళ్ళొచ్చు.

కానీ తను అంత దూరం నడిచి వెళ్ళగలడా?

గోపాల్ పరధ్యానంగా రోడ్డు మీదకు వచ్చాడు. తలకి ఎర్రటి మఫ్లర్ చుట్టుకుని, కాకిరంగు చిరుగుల స్వెట్టర్ వేసుకున్న ముసలి రిక్షావాలా అతనికి ఎదురొచ్చాడు.

"రండిసార్! రండి" అని గోపాల్ చేతిలోని సూట్‌కేస్ అందుకుని రిక్షాలో పెట్టాడు.

'ఈ రిక్షావాడి ముఖం ఎక్కడో చూసినట్లుందే' అనుకుంటూ రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

కొంతదూరం పోయాక గోపాల్‌కి అనుమానం వచ్చింది. రిక్షా ఎక్కడికి పోతున్నది? ఎక్కడికి వెళ్లాలో తను చెప్పలేదే! అతను అడగనూలేదు.

మరి ఎక్కడికి తీసుకెళ్తున్నాడా?

లేకపోతే కాల్‌గరల్ దగ్గరికి లాక్కెళ్తాడా?

"ఏయ్ రిక్షా ఆపు" అన్నాడు గోపాల్,

"ఏంటి సార్?"

"ఎక్కడికెళ్ళాలో నేను చెప్పనేలేదు. ఎక్కడికి తీసుకెళ్తున్నావ్?" సీరియస్‌గా అడిగాడు గోపాల్.

"మీరెక్కడికి వెళ్లాలో నాకు తెలుసుసార్" వెనక్కి తిరిగి చూడకుండానే జవాబు చెప్పాడు రిక్షావాలా.

గోపాల్‌కి ఆశ్చర్యం కలిగింది.

"నేనెక్కడికెళ్ళాలో నీకు తెలుసా? గమ్మత్తుగా వుందే! అయితే చెప్పు చూద్దాం?"

"మీరు కొత్తపేట వెళ్ళాలి"

"అరే! కరెక్టుగా చెప్పావే! అయితే నేను నీకు తెలుసన్నమాట" అన్నాడు గోపాల్.

"బాగా తెలుసు సార్! మీరు సూర్యనారాయణ అల్లుడు గారు" రిక్షా అతను చెప్పాడు.

"వండ్రఫుల్ . అయితే నీకు మా మావగారు బాగా తెలుసన్నమాట" గోపాల్ అన్నాడు.

"తెలుసా ఏమిటి సార్! ఆయనా, నేను క్లోజ్ ఫ్రెండ్స్‌కూడా" అన్నాడు రిక్షా అతను.

"వాట్ మా మామగారు నీకు క్లోజ్ ఫ్రెండా?" నోరు వెళ్ళబెట్టాడు గోపాల్.

"ఏం? మీ మావగారికి ఒక రిక్షావాడు ఫ్రెండ్ కాకూడదా?" అడిగాడు రిక్షా అతను.

"అహఁ... అదికాదు. మా మావగారు గవర్నమెంట్ ఎంప్లాయి" అన్నాడు గోపాల్.

"నేనూ మీ మావగారి ఆఫీసులోనే పని చేసేవాడిని. అదంతా గతం" రిక్షా అతను అన్నాడు.

"ఏమిటీ మీరు గవర్నమెంట్ జాబ్ చేసేవారా? మరిదేమిటి, ఈ రిక్షా తొక్కడం? ఒకవేళ మిమ్మల్ని సస్పెండ్ చేశారా?" అడిగాడు గోపాల్.

"నన్ను సస్పెండు ఎందుకు చేస్తారు? నేనేమైనా తప్పుడు పనులు చేశానా? ముప్పై ఏళ్ళు నిజాయితీగా పనిచేశాను. అవకాశం వచ్చినా లంచాలు తినలేదు."

"లంచాలు తీసుకోకుండా నిజాయితీగా పనిచేశారు. బాగానేవుంది. గవర్నమెంట్ జీతాలు బాగానే ఇస్తున్నదిగా మరీ రిక్షా లాక్కోవలసిన దుస్థితికి ఎలా దిగజారారు?" అడిగాడు గోపాల్.

"అదంతా దశమగ్రహ ప్రభావం సార్!"

దశమగ్రహం అంటే ఏమిటో గోపాల్‌కి తెలియదు. అదేదో శనిగ్రహంలాంటిదని అనుకున్నాడు.

"పేకాట, తాగుడువంటి వ్యసనాలకు బానిసలయ్యారా?" అడిగాడు గోపాల్.

"నో... నో.... నా జీవితంలో పేకాట ఆడలేదు. తాగలేదు" చెప్పాడు రిక్షావాలా.

"విచిత్రంగా వుందే"

"విచిత్రంకాదు. విధిరాత"

గోపాల్‌కిప్పుడు చాలా ఇబ్బందిగా వుంది ఆ రిక్షాలో కూర్చోవడం. ఈ ముసలాయన తన మావగారి కొలీగ్ పైగా గవర్నమెంట్ జాబ్‌చేసినవాడు. పాపం పరిస్థితుల

ప్రభావం వలన రిక్షా తొక్కి సంపాదించుకోవాల్సి వచ్చింది. అటువంటాయన తొక్కుతున్న రిక్షాలో తను కూర్చోవడం ఏం బాగుంటుంది? ముందే తెలిస్తే అది వేరేసంగతి. అసలా రిక్షా ఎక్కేవాడేకాదు. సగంలో తెలిసింది. ఇప్పుడేం చేయాలి? రిక్షాలోనుంచి తను దిగిపోతే! నడవాల్సివస్తుంది.

ఆ చలిలో రిక్షా దిగి నడవడానికి గోపాల్ మనసు అంగీకరించలేదు. మౌనంగా కూర్చున్నాడు.

"మీ ఉద్యోగం ఎందుకు పోయింది?" ప్రశ్నించాడు.

"పోలేదు. నేను మానేశాను"

"ఏం?"

"వాలంటరీగా రిటైరయ్యాను"

"మీ అబ్బాయికి ఉద్యోగం ఇప్పించారా?"

"ఉహూఁ!"

"అలా చేశారేం? సర్వీసు చివర్లో జీతం బాగా పెరుగుతుందిగా. కనీసం వెయ్యి రూపాయలు గ్రాస్ పెరిగేది. రిటైరయ్యాక పెన్షన్ కూడా ఎక్కువ వచ్చేదిగా!" అన్నాడు గోపాల్.

"నిజమే. కానీ నా కూతురు పెళ్లికోసం అలా చెయ్యాల్సివచ్చింది."

గోపాల్ ఉలిక్కిపడ్డాడు.

అతను చెప్పుకుపోతున్నాడు.

"అమ్మాయి పెళ్లి చెయ్యమని నా భార్య పోరు పెట్టసాగింది. పెళ్లి కుదిరితే డబ్బు కావాలికదా? నేను ముప్పై ఏళ్లు సర్వీసు చేసినా డబ్బు కూడబెట్ట లేకపోయాను. నా సర్వీసులో చేరినప్పటినుంచి ఈ నెల ఎట్లా గడుస్తుందిరా దేవుడా? అనుకోవడమే.

నా కుటుంబ పరిస్థితులు అటువంటివి. నేను ఒక్కడే కొడుకుని. నా తల్లిదండ్రులు నాతోనే ఉండేవాళ్ళు. మా నాన్న కోమటికొట్లో గుమాస్తాగా పనిచేసేవాడు. వచ్చే జీతం సరిపోయేది కాదు. తినీ తినకా కాలం గడిపేవాళ్ళం. నేను అష్టకష్టాలు పడి చదువుకున్నాను. టెక్స్టుబుక్స్ కొనలేకపోయేవాడిని. స్కూల్ ఫీజు కట్టలేకపోయేవాడిని. ట్యూషన్స్ చెప్పించలేకపోయేవాడిని. ఎట్లాగో స్కూల్ ఫైనల్ పాసయ్యాను. కొన్ని ప్రవేటు ఉద్యోగాలు చేశాను.

నీతినిజాయితీలు వున్న రోజులు గనుక నాకు సర్వీస్ కమీషన్ సెలక్షన్ వచ్చింది. గవర్నమెంట్ ఉద్యోగం వచ్చాక మా ఇంటి పరిస్థితి మెరుగైంది. కడుపునిండా తిండి,

ఉండడానికి మంచి ఇల్లు ఏర్పడగానే నా తల్లిదండ్రుల కోరికలకు రెక్కలొచ్చాయి. కోడలు ఇంట్లో తిరగాలనీ, మనుమలను ఎత్తుకోవాలని కలలు కన్నారు. పెళ్లిచేసుకోమని పోరసాగారు.

ఆడపిల్లల తండ్రులు ఇంటిచుట్టూ తిరిగేవారు. ఆ రోజుల్లో కట్నాలు ఎక్కడివి? వెయ్యినూట పదహార్లు ఇస్తే గొప్ప. నాకు నాలుగు వేలు ఇస్తామని వచ్చేవాళ్ళని చూసి మా తల్లిదండ్రులు ఆగలేకపోతున్నారు.. నేను మాత్రం ససేమిరా అంటున్నాను.

అడుక్కునేవాడు కూడా పెళ్లిచేసుకుంటాడనీ, ఏ రోజుకారోజు కూలి చేసుకునేవాడు కూడా దర్జాగా చేసుకుంటాడనీ ఏదేదో చెప్పి నన్ను లొంగదీయాలను కునేవాళ్ళు ఒక్కదాన్నీ పనిచేసుకోలేకపోతున్నాననీ, కోడలొస్తే తనకు తిప్పలు తప్పుతాయని మా అమ్మ గొణుగుతూ వుండేది. అంతగా చేసుకోలేక పోతే పనిమనిషి పెట్టుకో అని కేకలు పెట్టేవాడిని.

రోజులన్నీ మనవి కాదనే మాట నిజమే!

మనం అనుకున్నవి జరగవు అనుకోనివి జరుగుతాయి. అదే జీవితం అంటే.

మా ఆఫీసులో సీత అని టైపిస్టు వుండేది. ఆమెతో నేను చనువుగా వుండేవాడిని. ఆమె కొత్తగా జాబ్‌లో ప్రవేశించింది. ఆమెకు తెలియనివి నన్ను అడుగుతూ వుండేది.

మా కొలీగ్ ఒకాయన మా వీధిలోనే కాపురం వుండేవాడు. నేను, సీత ప్రేమించుకుంటున్నామనీ, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నామనీ పుకారు పుట్టించాడు. సీతది మా కులం కాదు. ఆ రోజుల్లో కులం పట్టింపులు బాగా వుండేవిలెండి.

మా అమ్మ కొంప మునిగిపోయినట్లు గొడవ చేసింది. అటువంటి కులాంతర వివాహం చేసుకుంటే బావిలో పడతానని బెదిరించింది. నా గురించి సీతకు చెడ్డపేరు రావడం నేను సహించలేకపోయాను. నేను పెళ్లిచేసుకోవడమే సమస్యకు పరిష్కారమనిపించి కులమింటి కోతిని చేసుకున్నాను"

అంతా చెప్పి అతను పకపక నవ్వాడు.

గోపాల్‌కి కూడా నవ్వొచ్చింది.

'మీ స్టోరీ చాలా ఇంట్రెస్టింగ్‌గా వుందండి. సినిమా తీస్తే వందరోజులు ఆడేలా వుంది" అన్నాడు.

"మీకేమైనా రాసే అలవాటు వుంటే రాయండి. నాకేం అభ్యంతరం లేదు. సినిమావాళ్ళు ఏమైనా డబ్బిస్తే నాకు కూడా తృణమో, పణమో ఇవ్వండి" అని జోక్ చేశాడు అతను.

"కథలు రాసే అలవాటుంటే బాగానే వుండేది. తృణమో, పణమో సంపాదించుకునేవాడిని తీరిక వేళల్లో! ఏదీ మనకా కళ అబ్బలేదు. ఉత్తరం రాయడమే చేతకాదు నాకు" అన్నాడు గోపాల్.

అతను మళ్ళీ కథ మొదలుపెట్టాడు.

"పెళ్ళయిన తర్వాత ఎన్ని సంఘటనలు జరిగాయో? ఎన్నని చెప్పగలను? జీవితమంతా దరిద్రం అనుభవించానని ఒక్క మాటలో చెప్తే సరిపోతుంది"

"మీ జీతం సరిపోయేది కాదా?"

"హుఁ ఏం జీతంలెండి. నాకు పెళ్లయినప్పుడు నూట యాభై రూపాయల జీతం. అందులో ఇంటికి అద్దె కట్టి నలుగురం బతకాలి"

"నూట ఏభై. అంతేనా?" ఆశ్చర్యపోయాడు.

"మరేమనుకున్నారు? ఇప్పటిలాగా చేరగానే రెండువేల జీతం ఇచ్చేవారను కున్నారా? అప్పట్లో ఈ జీతగాళ్ళ జీవితాలు ఎలా వుండేయో ఆత్రేయ ఎన్.జీ.ఓ. అనే నాటకంలో చూపించాడు. ఆ నాటకం చూసి నేను ఏడుపు ఆపుకోలేకపోయేవాడిని. అది నా జీవితంలాగానే వుండేది.

కొన్నాళ్లకు మా నాన్నకి పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. నాలుగేళ్లు ప్రత్యక్ష నరకమే. నన్ను పెళ్లి చేసుకోమని సలహాలు ఇచ్చిన బంధువులు, మిత్రులు ఎవరూ నన్ను ఆదుకోలేదు. కనీసం ఎట్లా గడుస్తున్నదని అడిగేవాళ్లు కాదు. లంచాలు తీసుకోవడం తప్పు అని అప్పట్లో నాకో గుడ్డి నమ్మకం వుండేది.

అలాంటివాడినని జనం మెచ్చుకునేవాళ్ళు. పిచ్చి వాడినని కొలీగ్స్ నవ్వుకునే వాళ్లు.

జీతం చాలక ఒక ఆడిటర్ దగ్గర అసిస్టెంట్‌గా చేరాను. సాయంకాలం వెళ్ళి లెక్కలు రాసినందుకు తృణమో పణమో ఇచ్చేవాడు. తర్వాత మా తల్లిదండ్రులు చనిపోయారు. ఇద్దరు మగపిల్లలు. ఒక ఆడపిల్ల పెరుగుతున్నారు. కాన్వెంట్స్‌లో చదివించే స్తోమత లేక మున్సిపాల్టీ స్కూల్లో చదివించాను.

ఇద్దరబ్బాయిలూ తెలివిగలవాళ్ళు. పెద్దవాడు పాలిటెక్నిక్‌లో డిప్లొమా సంపాదించాడు. రెండోవాడు బి.కామ్. అమ్మాయి బి.ఏ. చదివింది.

అబ్బాయిలు ఉద్యోగాలు సంపాదించుకుని పెళ్లిళ్లు చేసుకొని రెక్కలొచ్చి ఎగిరిపోయారు.

అమ్మాయి పెళ్లి బాధ్యత మిగిలింది.

చెల్లెలిపెళ్లి నాన్న ఎలా చేస్తాడో ఇద్దరిలో ఒక్కడు కూడా ఆలోచించలేదు. వాళ్ళు వాళ్ళ పెళ్లాం, పిల్లలు, మావగార్ల సలహాలతో డబ్బుని వృద్ధి చేసుకోవడం నేర్చుకున్నారు. చిట్‌ఫండ్ కంపెనీలలో చిట్స్, షేర్లు కోసం, బ్యాంక్ డిపాజిట్లు కట్టడం.

పచ్చి స్వార్థపరులయ్యారు. పోనీ వాళ్ళయినా బాగుపడనీ అనుకున్నాను. అమ్మాయి పెళ్లి చెయ్యమని నా భార్య పోరుతూ ఉంది.

ఏం చేయాలి? అని తీవ్రంగా ఆలోచించాను.

వాలంటరిగా రిటైరైతే నాకు లక్షన్నర వస్తుంది. నెల నెల వెయ్యిరూపాయలు పెన్షన్ వస్తుంది. కట్నం యాభైవేలు ఇచ్చి, పాతికవేలు పెళ్లికి ఖర్చు పెట్టినా ఇంకా డెబ్బైఐదు వేలుంటాయి. నెలనెలా వడ్డీ ఇచ్చే స్కీములో వేస్తే ఏడువందలవరకూ వస్తాయి. ఇద్దరం బతుకుతాం అని ఆలోచించాను.

సమయానికి మంచి సంబంధం వచ్చింది! అబ్బాయికి గవర్నమెంట్ జాబ్. లక్ష కట్నం అడిగారు. యాభై వేలకి మించి ఇవ్వలేనన్నాను. అమ్మాయి వాళ్ళకి బాగా నచ్చింది. అయితే కట్నం నచ్చలేదు. మధ్యవర్తి ద్వారా డెబ్బై అయిదు వేలు ఇస్తే చేసుకుంటామని కబురు చేశారు. మంచి సంబంధమనీ, ఒప్పుకోమని నా భార్య పోరసాగింది. సరేననక తప్పలేదు. వాలంటరీగా రిటైరయ్యాను. డబ్బు చేతికి అందింది. డెబ్బైఐదు వేలు కట్నం ఇచ్చాను.

అల్లుడికి వాచీ, ఉంగరం కావాలన్నారు. వెండి పళ్ళెం, వెండిగ్లాసు తీసుకోవడం వారి ఆచారమట. అల్లుడు అలకపాన్పు ఎక్కి స్కూటర్ కొనివ్వకపోతే దిగనన్నాడు. స్కూటర్ లేకపోతే ప్రిస్టేజ్ పోతుందన్నాడు. పెళ్లికి కోడళ్లు వచ్చారు. పట్టుచీరలు కొనివ్వమన్నారు. ఒక్కొక్కటి మూడువేలట. అన్నింటికీ గంగిరెద్దులా తల ఊపాను. డబ్బు మంచినీళ్లలా ఖర్చయింది. పెళ్లయి అమ్మాయి అత్తగారింటికి వెళ్లే సరికి లక్షన్నర హారతికర్పూరమైంది.

పెన్షన్ వెయ్యి వస్తున్నది. అందులో ఇంటికి అద్దె కట్టి ఇద్దరం ఏం తినాలి? నెల నెలా చెరొక రెండొందలు పంపమని ఇద్దరు కొడుకులకు లెటర్స్ రాశాను. వాళ్ళ ఇబ్బందులు ఏకరువు పెట్టారు. రూపాయి మిగలడం లేదు. ఇంటికి వస్తే డబ్బు అడుగుతానేమోనని రావడం మానేశారు. వచ్చిన డబ్బంతా కూతురికే ధారపోశానని ప్రచారం మొదలుపెట్టారు.

ఎక్కడైనా చేరి లెక్కలు రాద్దమని ప్రయత్నించాను. కొందరు ముసలోడివి నువ్వేం రాస్తావన్నారు. మరికొందరు కంప్యూటర్లే లెక్కలు చేస్తున్నాయి పొమ్మన్నారు. మా ఆఫీసులోనే

రిటైరైన ఒక అటెండర్ రిక్షా తొక్కి సంపాదించడం గమనించాను. వాడి సహాయంతో ఈ వృత్తిలోకి దిగాను.

రాత్రిపూట ఎవరూ గుర్తుపట్టకుండా తలకి గుడ్డ చుట్టుకుని రిక్షా తొక్కుతున్నాను.

ఏదో నాలో శక్తి వున్నంతకాలం జరిగిపోతుంది.

ఇందులో తప్పేముంది చెప్పండి?"

గోపాల్ ఏమీ మాట్లాడలేదు.

రిక్షా కొత్తపేటలో ప్రవేశించి సూర్యనారాయణ ఇంటిముందు ఆగింది. గోపాల్ రిక్షా దిగాడు.

స్ట్రీట్ లైట్ వెలుగులో జేబులో నుంచి పర్సు తీసి పదిరూపాయల కాగితం తీసి "ఇదుగోండి" అంటూ అందించడానికి తలెత్తాడు.

మఫ్లర్ తీసి తుండుతో ముఖం తుడుచుకుంటున్న రిక్షావాలని ఆ వెలుతురులో చూసి షాక్ కొట్టినవాడిలా బిగుసుకుపోయాడు గోపాల్.

ఆయన సూర్యనారాయణ సాక్షాత్తు తన మావగారు. "రండి లోపలకు" అని లోపలకి దారితీశాడు.

గోపాల్‌కి అడుగు ముందుకు పడలేదు.

-స్వాతి సపరివారపత్రిక, ***17-2-1995***